నవశకం
సంక్షేమ సంతకం

చేయూతనిచ్చి.. అండగా నిలిచి

- వైఎస్సార్ పింఛన్ కానుకతో వృద్ధులకు భరోసా కల్పించిన సీఎం జగన్
- ఇతరులపై ఆధారపడే బాధ తప్పిందని పింఛన్‌దారుల హర్షం

మాట ఇస్తే ఆరు నూరైనా చేసి చూపించే నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. వృద్ధులు.. వికలాంగులు.. వితంతువులకు రూ. 3 వేలు పింఛన్ ఇస్తామని చెప్పిన ఆయన చెప్పింది చేసి చూపించారు. దీంతో పింఛన్‌దారులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జన్మభూమి కమిటీల దోపిడీకి గురైన తమకు ఇప్పుడు సీఎం జగన్ దయ వల్ల పూర్తిగా పింఛన్ అందుతోందని.. నెల మొదటి రోజే జగన్‌బాబు తమకు వలంటీర్ల ద్వారా పింఛన్ డబ్బు పంపించటం వల్ల ఆర్థికంగా భరోసా దొరికిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



36వ వార్డుకి చెందిన వృద్ధురాలికి కేజీహెచ్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుబ్రహ్మణ్యం (ఫైల్)

దాబాగార్డెన్స్ : వారంతా ఏడు పదుల వయసు వారు. వీరిలో కొంత మందికి పిల్లలున్నా చూడని దుస్థితి. మరికొంత మందికి పిల్లల్లేరు. ఇంకొందరిని ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పైనే పిల్లలు చూస్తున్నారు. అటువంటిది గత ప్రభుత్వం అందజేసిన వృద్ధాప్య పింఛన్ కోసం ఎంతో మంది వృద్ధులు వేకువ జామునే నిద్ర లేచి పింఛన్ కేంద్రాల వద్ద పడిగాపులు పడేవారు. పింఛన్ చేతికి వచ్చే వరకూ ఆ వృద్ధులకు టెన్షనే. వస్తుందా? రాదా? ఒకవేళ ఇస్తే ఎంత వస్తుందో? ఇలా అనేక విధాల బాధపడేవారు. వీరికి అందజేసే పింఛన్‌లో కూడా జన్మభూమి కమిటీ దోచుకునేది. కొత్త పింఛన్ మంజూరైతే రెండు నెలల పింఛన్ ఈ కమిటీ తీసుకునేది. అంతే కాక వృద్ధులు.. వికలాంగులు.. వితంతువుల థంబ్ సరిగ్గా పడకపోతే పలుమార్లు తిప్పేవారు. ఇలాంటి పరిస్థితుల్లో జగనన్న ప్రభుత్వం వచ్చింది.. పేద వృద్ధుల రాతలు మారాయి. తమ ప్రభుత్వం వస్తే గ్రామ స్వరాజ్య పాలన తెస్తానని జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. అన్నట్లుగానే అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో వృద్ధులు.. వికలాంగులు.. వితంతువుల తల రాతలు మారాయి. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువ జామునే వలంటీర్లు నేరుగా అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు. ఒక్క పైసా తగ్గకుండా పింఛన్ ఇస్తున్నారు. ఎటువంటి థంబ్ సమస్య లేదు. ఒకటో తారీఖు వస్తుందంటే పింఛన్‌దారుల కళ్లల్లో వెలుగులు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఏడాదికేడాది పింఛన్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. కానీ ఏ ఒక్కరికీ పింఛన్ ఆపిన పాపాన పోలేదు. మరీ ముఖ్యంగా కరోనా సమయంలో కూడా పింఛన్ నిలపకుండా ప్రతి నెలా అందజేసి జగనన్న ప్రభుత్వం వృద్ధులు.. వికలాంగులు.. వితంతువులకు బాసటగా నిలిచింది.

వృద్ధులు మంచం పట్టినా.. ఆస్పత్రి పాలైనా..

పింఛన్ తీసుకునే వృద్ధులు, వికలాంగులు అనారోగ్యానికి గురై ఎంత దూరంలోని ఆస్పత్రిలో ఉన్నా సీఎం జగన్ ప్రభుత్వం ఊరకే వారిని వదిలేయటం లేదు. మొక్కవోని దీక్షతో వలంటీర్ ఆ పింఛన్‌దారుని వెదుక్కుంటూ వెళ్లి.. పింఛన్ సొమ్ము అందించి వస్తున్నారు. అది తమ బాధ్యతగా ప్రభుత్వం భావించటం పట్ల వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కన్నవారు కూడా తమ కోసం ఇంతలా తపించటం లేదని వారు ఉద్వేగానికి లోనవుతున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంతో పోలిస్తే.. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే తమకు బాగుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గత ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం వేకువ జాము నుంచే ఇలా ఎదురుచూపులు షరా మామూలే (ఫైల్)



నాటి ప్రభుత్వ హయాంలో పింఛన్ కార్యాలయం ముందు పడిగాపులు పడుతున్న వృద్ధులు (ఫైల్)

కొడుకులా ఆదుకుంటున్నాడు..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొడుకులా ఆదుకుంటున్నాడు. వృద్ధుల సమస్యలు తెలిసిన నాయకుడు ఆయన. నెలకు రూ.3 వేల పింఛన్ ఇవ్వడం వల్ల ఎంతో మంది నా లాంటి వాళ్లు శేష జీవితంలో ఆనందంగా ఉంటున్నారు.

– ఎలగ అప్పారావు, వేంకటేశ్వరమెట్ట

జగన్ పుణ్యమే..



జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని సంతోషంగా ఉన్నాం. నెల మొదటి రోజే నేరుగా మా ఇళ్లకే వలంటీర్ వచ్చి పింఛన్ అందజేస్తున్నారు. మా ఖర్చులకు పిల్లలపై ఆధారపడకుండా పింఛన్ డబ్బులు ఎంతో దోహదపడుతున్నాయి.

– మార్నెళ్ల సుదర్శనమ్మ, అల్లిపురం

నెలంతా సరిపోతున్నాయి..



గతంలో రూ.2,250 ఇచ్చేవారు. ఆ తర్వాత రూ.2,500, గత ఏడాది రూ.2,750, తాజాగా రూ.3 వేలు అందుకుంటున్నాం. జగన్‌బాబు ఇస్తున్న పింఛన్ వల్ల నెలంతా మా ఖర్చులకు సరిపోతున్నాయి. పింఛన్ రూ.250 ఉన్నప్పటి నుంచి తీసుకుంటున్నాను. ఆర్థికంగా భరోసా చిక్కింది.

– కిలిమి అప్పలనరసమ్మ, బంగారుమెట్ట

గతంలో పూర్తిగా ఇచ్చేవారు కాదు..



గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ వాళ్లు మా వద్ద దోచుకునేవారు. మాకు ఇచ్చిన పింఛన్‌లో కూడా కమిషన్ రూపంలో తీసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నేరుగా వలంటీరే ఇంటి వద్దకు వచ్చి థంబ్ వేయించుకుని వెంటనే డబ్బులు ఇచ్చేస్తున్నారు. ఒక్క పైసా తగ్గకుండా పింఛన్ ఇవ్వడం విశేషం.

– అక్కిరెడ్డి చిన్నతల్లి, పాతనగరం

క్లుప్తంగా

కేజీహెచ్ ఏవోకు పదోన్నతి



జోగిరాజును సత్కరిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : కింగ్ జార్జి ఆస్పత్రి పరిపాలనాధికారి (ఏవో) సీహెచ్ జోగిరాజు పదోన్నతి పొందడంతో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ శుక్రవారం ఆయనను ఘనంగా సత్కరించారు. జోగిరాజుకు శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ సత్కార కార్యక్రమంలో కేజీహెచ్ డీసీఎస్‌ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, మేనేజర్ శర్మ, చీఫ్ డైటీషియన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'గుర్తుకొస్తున్నాయి'



గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

అల్లిపురం : మెలోడీ క్రియేటర్స్, శృతిలయలు, రసరాగమాధురి, కళాంజలి, సరిగమప సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గుర్తుకొస్తున్నాయి సినీ సంగీత విభావరి సంగీత ప్రియులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, వంకాయల సన్యాసిరాజు పాల్గొని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక సంస్థల గాయనీ గాయకులు ఆలపించిన సినీ గీతాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మెలోడీ సత్యనారాయణ, ఎంపీ రాజశేఖర్, కడలి, వి.ప్రభాకర్, ఎంఎస్ మాధవ్, పుండరీ కుమార్, వీవీ చారి, సురేష్‌ఖన్నా, సత్యవతి, జ్యోతి, సత్యశ్రీ, లక్ష్మి, సాత్విక, నిషిత, కొణతాల రాజు, ఫణిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అల్లిపురం : వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలానికి చెందిన పోతల కొండబాబు జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో కలాసీగా పని చేస్తున్నాడు. అతను కుటుంబంతో కలిసి అల్లిపురంలోని బంగారమ్మమెట్టలో జీవిస్తున్నాడు. సంక్రాంతి పండగ సందర్భంగా కుటుంబంతో సొంత గ్రామమైన చీడికాడ వెళ్లి గురువారం సాయంత్రం తిరిగి వచ్చాడు. అనంతరం భార్య చెల్లయ్యమ్మతో గొడవ పడి మద్యం తాగి వచ్చాడు. రాత్రి కుటుంబం అంతా భోజనాలు చేసి నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారి 6 గంటల సమయంలో చెల్లయ్యమ్మ లేచి చూసే సరికి ఇంటి గ్రిల్ పైన రాడ్డుకు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో ఆమె చుట్టుపక్కల వారిని పిలిచింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య చెల్లయ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ

ఎంవీపీకాలనీ: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్, విశాఖ ధార్మిక సలహా మండలి, విశాఖ సాగర దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా సీతారాములకు సహస్ర దీపాలంకరణ చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా ఈకార్యక్రమం జరిగింది. సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామికి ప్రత్యేక హారతిని కనువిందుగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రజాసేవే ధ్యేయం

– ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



34వ వార్డులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్




జామియా మసీదు ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న పోలమాంబ ఆలయ కమిటీ సభ్యులు

అల్లిపురం : తాను నమ్మిన ప్రజలకు అండగా ఉంటూ వారి సేవే ధ్యేయంగా సేవలందించడమే తన బాధ్యత అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తిగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. శుక్రవారం ఏవీఎన్ కాలేజీ దరి జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా మహారాణిపేట కుమ్మరవీధి శ్రీ పోలమాంబ అమ్మవారి జాతరకు ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు డి.సత్యనారాయణ, వై.సత్యనారాయణ, దుర్గాప్రసాద్ తదితరులు ఆహ్వానించారు.

34వ వార్డులో..

అచ్చియ్యమ్మపేట జంక్షన్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో 32, 33, 34 వార్డులకు సంబంధించిన ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. వాటికి సంబంధించి అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న జగనన్న ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే స్థాపించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నేక్) ద్వారా నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ అందజేస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకం కింద ఉచిత శిక్షణ, ఉపాధి నిమిత్తం నేరుగా అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దీనికి పది పాసైన వారు అర్హులని, ఈ శిక్షణ రెండు మాసాలు ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 8309059974 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మహారాణిపేట : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంఘీభావంగా డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళి అర్పించారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్, అసోసియేషన్ సభ్యులు సంయుక్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం రాష్ట్ర సంఘం నాయకులు భార్గవ్ సుతేజ్, వీవీ కిరణ్‌కుమార్, రవికుమార్, ఎంప్లాయీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, అనిమిరెడ్డి, రమణ, నారాయణరావు, కర్రి రాజేష్, నూర్జహాన్ బేగం, బి.వి. అశోక్‌కుమార్, కిషోర్, పెదకపు రాము, మురళి, శ్రీనివాస్, జ్యోతి, చిరంజీవి, జాన్‌బాబు, రమేష్‌బాబు, రియాజ్, రోశయ్య, జ్యోతి పాల్గొన్నారు.

కులగణన సర్వే ప్రారంభం



గౌరీవీధి సచివాలయం ఆధ్వర్యంలో కులగణన చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ పార్వతి తదితరులు



కుమ్మరవీధి సచివాలయం ఆధ్వర్యంలో కులగణన చేస్తున్న పాల శ్రీహరిరెడ్డి, సిబ్బంది

అల్లిపురం : రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయం మేరకు సచివాలయాల పరిధిలో కులగణన ప్రక్రియ శుక్రవారం ప్రారంభమయింది. ఈ మేరకు 33వ వార్డులో గౌరీవీధి సచివాలయం, కుమ్మరవీధి సచివాలయం సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పార్వతి పాల్గొని మాట్లాడుతూ ఈ సర్వే రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పీవీ కిరణ్‌కుమార్, జయచంద్ర, రాజు, షాహిద్, జాన్‌బాబు, వలంటీర్లు వీనం నాగలక్ష్మి, యామిని, కిరణ్, పొట్టి నాగమణి తదితరులు పాల్గొన్నారు. కుమ్మరవీధి సచివాలయం ఆధ్వర్యంలో జరిగిన కులగణన కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, వెల్ఫేర్ సెక్రటరీ పార్వతి, ప్లానింగ్ సెక్రటరీ లక్ష్మి, వలంటీర్లు మానస, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుంచమాంబను దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి



జ్యోతి వెలిగించి కుంచమాంబ ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



కుంచమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : జీవీఎంసీ 30వ వార్డులో శుక్రవారం నిర్వహించిన కుంచమాంబ అమ్మవారి పరస మహోత్సవంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ముందుగా ఆయనకు వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు నిమ్మకాయల శివాజీ, దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రసిద్ధిగాంచిన కుంచమాంబ ఆలయంలో ప్రతిఏటా వైభవంగా పరస మహోత్సవం జరుగుతుందన్నారు. ప్రజల కష్టాలు తీర్చే జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో జనతాబజార్

- ఆక్రమణలో ఫుట్‌పాత్‌లు, రహదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



శిథిలావస్థకు చేరుకున్న జనతా బజార్



స్క్రాప్ వాహనాలతో నిండిపోయిన ప్రధాన రహదారి

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న జనతా బజార్‌ను 1972లో 72 దుకాణాల సముదాయంగా నిర్మించారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ భవనాలకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకుని నేడో. .రేపో కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే కొన్ని చోట్ల భవనం శ్లాబ్ పెచ్చులూడిపోతోంది. మరోపక్క పిల్లర్లు కూడా కూలిపోతున్నాయి. ఇదిలా ఉండగా జనతాబజార్‌లో వ్యాపారాలు చేసుకుంటున్న వారు అద్దెలు చెల్లించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడి ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని స్క్రాప్ సామాన్లు పరిచేయడం వల్ల లక్షల వ్యయంతో నిర్మించిన ఫుట్‌పాత్‌లు పూర్తిగా ధ్వంసం అయిపోయాయి. స్క్రాప్ వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేయడం వలన ఇబ్బందులకు గురవుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటే శిథిలమైన జనతాబజార్ బాగుపడడంతో పాటు ట్రాఫిక్ సమస్య తీరుతుందని స్థానికులంటున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

మద్దిలపాలెం: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఎంవీపీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ఎస్.వి.ప్రసాద్ ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు.

తెలుగు సాహితీ వెలుగు రేఖ వేమన

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఇతర నాయకులు

సీతమ్మధార : తెలుగు సాహితీ వెలుగు రేఖ వేమన అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆశీలమెట్టలోని వేమన సంక్షేమ సంఘంలో నిర్వహించిన యోగి వేమన జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచీ చెడులను తెలియజేసిన మహా యోగి వేమన అన్నారు. ఈ కార్యక్రమంలో వేమన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు సత్తి నాగేశ్వర రెడ్డి, సలహాదారు డి.నారాయణరెడ్డి, అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి, జనరల్ సెక్రటరీ సత్తి రామకృష్ణారెడ్డి (గౌతమి), కోశాధికారి బాలరెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ తాతారెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యాంకుమార్‌రెడ్డి, బోర కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, నీలాపు రమణారెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, ఇరిగేషన్ ఏఈ ధర్మేందర్‌రెడ్డి, బైరెడ్డి పోతన్నరెడ్డి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

తిరిగి అధికారంలోకి వైఎస్సార్‌సీపీ..

2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. ఆశీలమెట్టలోని వేమన సంక్షేమ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీఎం జగన్ అనితరసాధ్యంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్ని పార్టీలు వచ్చినా, ఎంత మంది నాయకులు కలిసినా అధికారంలోకి వచ్చేది జగన్ ప్రభుత్వమే అన్నారు. విశాఖ జిల్లాకు చెందిన స్థానిక రెడ్లను బీసీ–'ఎ'లో చేర్చాలన్నారు. రెడ్డి సంఘానికి స్థలం కేటాయించాలని, బీచ్ రోడ్డులో యోగి వేమన విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.